# హోర్డింగ్‌లన్నీ 'కృష్ణా'ర్పణం!

### అంతా నవ నిర్మాణ్ సంస్థకు కట్టబెట్టేందుకే...

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా హోర్డింగ్‌ల (అడ్వర్టైజ్‌మెంట్) ద్వారా ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఈ ఆదాయాన్ని నవ నిర్మాణ్ సంస్థకు కట్టబెట్టేందుకే ప్రభుత్వంలోని పెద్ద మనుషులకు సంబంధించిన కుటుంబసభ్యులతో కలిసి వ్యాపారం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో అప్పన్నంగా కట్టబెట్టారు. ట్యాక్సులు పెంచైనా ఇవ్వండి.. ఎంతైనా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని కోరినా అధికారులెవ్వరూ స్పందించడం లేదు. ప్రతి ఏడాది రాష్ట్రవ్యాప్తంగా హోర్డింగ్‌లన్నింటినీ నవ నిర్మాణ్ సంస్థకు కట్టబెట్టేందుకు ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఏడాదిగా పావులు కదుపుతున్నారు. అందుకే ఇదంతా చేస్తున్నారు. దీని ద్వారా ఈ రంగంపై దశాబ్దాలుగా ఆధారపడి జీవిస్తున్న లక్షల కుటుంబాలు వీధినపడతాయి. ప్రభుత్వం మాకు ప్రత్యామ్నాయ ఉపాధినైనా చూపించాలి.

- తెలంగాణ అవుట్‌డోర్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు

**రెండేండ్లపాటు వందల కోట్లు నష్టపోయిన స్థానిక సంస్థలు**

- రాష్ట్రవ్యాప్తంగా ఏటా వందల కోట్లల్లో హోర్డింగ్‌ల వ్యాపారం
- ఏడాదికిపైగా రెన్యువల్ సైట్‌ను నిలిపివేసిన పురపాలక శాఖ
- అనుమతులు లేవంటూ మరోవైపు హోర్డింగ్‌ల తొలగింపు
- ఫీజుల సవరణ సాకుతో లక్షల కుటుంబాల ఉపాధికి గండి
- 'బిగ్'డీల్ కోసమే అనుమతులు, రెన్యువల్స్ నిలిపివేత?
- నవ నిర్మాణ్ సంస్థకు కట్టబెట్టేందుకే
- తెలంగాణ అవుట్‌డోర్ మీడియా అసోసియేషన్ ఆరోపణ




హైదరాబాద్ సిటీబ్యూరో/మణికొండ, మార్చి 17 (నమస్తే తెలంగాణ): రాజకీయ, వాణిజ్య ప్రకటనల్లో కనకవర్షాన్ని కురిపించే హోర్డింగ్‌ల వెనక ఇదో భారీ కుట్ర. రాష్ట్రవ్యాప్తంగా, ప్రధానంగా హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఏటా కోట్లాది రూపాయల ఆదాయానికే కాదు; ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షల కుటుంబాల ఉపాధికి సైతం సాక్షాత్తూ రాష్ట్ర ప్రభుత్వమే గండికొట్టడం విచిత్రమైన పరిణామం. ఒకేఒక్క కంపెనీకి హైదరాబాద్ చుట్టూ హోర్డింగ్‌ల ఏర్పాటు టెండరును కట్టబెట్టేందుకు ఏడాదిగా 'నిర్మాణా'త్మకంగా ఈ కుట్రను అమలుచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొత్త హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోవడంతోపాటు గతంలో అనుమతులు తీసుకున్న వారికి సైతం రెన్యువల్ చేసేందుకు అవకాశం లేకుండా పురపాలక శాఖే సంబంధిత వెబ్‌సైట్‌ను నిలిపివేయడం కుట్ర వెనక పెద్దల హస్తం ఉందనేందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో కొన్నిరోజులుగా అనుమతులు లేవంటూ హైడ్రా, స్థానిక సంస్థలు ఆయా హోర్డింగ్‌లను కూల్చివేయడంతో దశాబ్దాలుగా ఈ రంగంపై ఆధారపడిన లక్షలాది మంది ఆందోళన చెందుతున్నారు. ఒక్క కంపెనీ కోసం పెద్దలు ఆడుతున్న ఈ హైడ్రామా కారణంగా తామంతా రోడ్డున పడతామంటూ కన్నీరుమున్నీరు అవుతున్నారు.

### ఆదాయం కోల్పోయిన స్థానిక సంస్థలు

రాజకీయ, వ్యాపార ప్రకటనల రూపంలో ఏటా వందల కోట్ల రూపాయల వ్యాపారం జరిగే హోర్డింగ్‌ల రంగంపై దశాబ్దాలుగా లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. హోర్డింగ్‌లకు అనుమతులు ఇవ్వడం వల్ల ఆయా స్థానిక సంస్థలకు ఫీజుల రూపంలో భారీ ఆదాయమే వస్తుంది. ఎక్కడికక్కడ స్థానిక సంస్థలే అనుమతులు ఇచ్చి ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. ఇందుకోసం పురపాలక శాఖ పరిధిలోని సీడీఎంఏ ప్రత్యేకంగా వెబ్‌సైట్ ఏర్పాటుచేసి కొత్త అనుమతులు, గతంలోని అనుమతులకు యేటా రెన్యువల్ ప్రక్రియను నిర్వహిస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హోర్డింగ్‌లకు సంబంధించిన కొత్త అనుమతులు, రెన్యువల్ ప్రక్రియను అటకెక్కించారు. దీంతో 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఆయా స్థానిక సంస్థలకు రావాల్సిన వందల కోట్ల ఫీజులకు గండిపడింది.

### ఫీజుల సవరణ సాకుతో మొదలై...

స్థానిక సంస్థల పరిధుల్లోని హోర్డింగ్‌లకు కొత్త అనుమతులుగానీ, గతంలోని అనుమతులకు రెన్యువల్‌గానీ చేయొద్దంటూ గత ఏడాది మార్చి 5న సీడీఎంఏ నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సర్క్యులర్ జారీ చేశారు. హోర్డింగ్‌ల ద్వారా స్థానిక సంస్థలకు వచ్చే ఆదాయం తక్కువగా ఉన్నందున వాటిని సవరించాల్సి ఉన్నదని, అందుకే అనుమతులు పొందిన హోర్డింగ్‌లకు రెన్యువల్ చేయొద్దని ఆదేశించారు. ఆదేశాలు వచ్చి ఏడాది దాటినా ఇప్పటివరకు పురపాలక శాఖ ఆ ఊసే ఎత్తడం లేదు. దీనిపై గతంలో అనుమతులు పొందిన హోర్డింగ్‌ల యజమానులు, సిబ్బంది.. సీఎంవో మొదలు కిందిస్థాయి మున్సిపాలిటీ, కార్పొరేషన్లలోని కమిషనర్లు, టీపీవోలను కలిసినప్పటికీ ఎవరూ ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదు.

### లక్షల మంది పొట్టకొట్టేది పెద్దల కోసమే

**ఈ హోర్డింగ్‌ల** కుట్ర వెనక ప్రభుత్వంలోని 'ముఖ్య'నేత సోదరుడు ఉన్నారనే ఆరోపణలున్నాయి. సదరు సోదరుడి మిత్రుడే ఒక సంస్థను తెరపై పెట్టి వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నారనే విమర్శలున్నాయి. లక్షల మందికి జీవనోపాధిగా ఉన్న హోర్డింగ్ రంగాన్ని సదరు సంస్థకు కట్టబెట్టేందుకే అంచెలంచెలుగా కుట్రను అమలు చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇతర సంస్థలు, వ్యక్తులకు చెందిన హోర్డింగ్‌లన్నింటినీ తొలగించి, ఆపై ఒకేసారి టెండర్ల ద్వారా ఆ కంపెనీకి హోర్డింగ్‌లను కట్టబెట్టేందుకు పక్కా స్కెచ్ వేశారని తెలుస్తున్నది. అయితే, కొత్తగా పిలిచే టెండర్లలో అనేక మెలికలు, కొత్త నిబంధనలు, సాధారణ ప్రకటనల సంస్థలకు అందుబాటులో లేని సౌకర్యాలు, పరికరాలను చేర్చి తాము అనుకున్న కంపెనీకి హోర్డింగ్‌ల అనుమతులు వచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకోసమే ప్రత్యేకంగా డిజిటల్ హోర్డింగ్‌ల పాలసీని రూపొందించే పని గుట్టుగా సాగుతున్నదని సమాచారం.

### తొలగింపుతో రెండో అంకం మొదలు

**రాష్ట్రవ్యాప్తంగా** హోర్డింగ్‌లన్నింటినీ ఒక్క కంపెనీకే కట్టబెట్టేందుకే ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. తొలుత కొత్త అనుమతులు, రెన్యువల్ ప్రక్రియను నిలిపివేశారని, రెండో అంకంలో గతంలో ఏర్పాటైన హోర్డింగ్‌ల తొలగింపును చేపట్టారని చెప్తున్నారు. కొన్నిరోజుల కిందట హైడ్రా శంషాబాద్ విమానాశ్రయ మార్గంలో ఉన్న సుమారు 144 హోర్డింగ్‌లను గుర్తించి, వాటిలో 60-70 వరకు తొలగించింది. దీంతోపాటు ఇతర కార్పొరేషన్ల పరిధిలో కూడా హైడ్రా పలు హోర్డింగ్‌లను తొలగించింది. ఇందులో వాస్తవానికి ఎలాంటి అనుమతులు లేనివి కొన్ని ఉండగా.. గతంలో అనుమతులు తీసుకున్నవి కూడా ఉన్నాయి. కానీ వాటిని రెన్యువల్ చేసుకునేందుకు ప్రభుత్వమే అవకాశం లేకుండా చేసి, అనుమతులు లేవనడం ఎంతవరకు సమంజసం అని సంబంధిత యజమానులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా హోర్డింగ్ యజమానులు కమిషనర్లను కలిసి తమకున్న అనుమతులు రెన్యువల్ చేయాలని కోరితే, ఇది తమ చేతుల్లో లేదని, పైస్థాయిలో ఏం జరుగుతున్నదో కూడా తమకు తెలియడంలేదని చెప్తున్నారు.




# ఎమ్మెల్యే బీర్ల బామ్మర్ది భూకబ్జా

- రఘునాథపురంలో ఎకరం భూమి కొని 4.08ఎకరాలు కబ్జాకు యత్నం
- మీడియా ఎదుట బాధిత రైతు మిర్యాల పద్మ ఆవేదన

యాదగిరిగుట్ట, మార్చి17 : భర్త తరపున తమకు సంక్రమించాల్సిన భూమిని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మేన బావమరిది ఎర్ర అయిలయ్య, ఆయన అనుచరులు కబ్జా చేసి తమను ఇబ్బంది పెడుతున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన మహిళా రైతు మిర్యాల పద్మ వాపోయింది. తన కుమారుడు మిర్యాల ప్రశాంత్‌తో కలిసి సోమవారం యాదగిరిగుట్ట బీఆర్ఎస్ కార్యాలయం లో మీడియా ఎదుట గోడును వెల్లబోసుకున్నది. వివరాలు ఆమె మాటల్లోనే.. రఘునాథపురం గ్రామానికి చెందిన మి ర్యాల నర్సయ్యకు తన(మిర్యాల పద్మ)తోపాటు మరో భార్య మిర్యాల సత్తమ్మ ఉంది. తన పేరిట 1.13 ఎకరాలు, మిర్యాల సత్తమ్మ పేరిట 1.13 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. 2022 ఏప్రిల్ 7న నర్సయ్య పక్షవాతంతో చనిపోయాడు. నర్సయ్య పేరిట రాజాపేట మండలం పొట్టిమర్రి వద్ద సర్వే నంబర్ 347/ఈలో 2.27 ఎకరాలు, 347/లో 1.21 ఎకరాలు ఉంది. ఇందులో మిర్యా ల సత్తమ్మ పేరిట 347/ఈలో 2.27 ఎకరాల భూమిని అక్రమంగా ఫౌతీ చేశారు. హక్కుగా రావాల్సిన భూమిని సత్తమ్మ అక్రమంగా చేయించుకుందని హైకోర్టులో పిల్ వేయగా ఫౌతీని నిలుపుదల చేయాలని కోర్టు ఆదేశాలిచ్చింది. హైకో ర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఎకరం భూమి 2023లో ఆకుల నర్సింహులు కొనుగోలు చేసి, ఏడాదిలోపే మల్లాపురం గ్రామానికి చెందిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మేనబావమరిది ఎర్ర అయిలయ్యకు రిజిస్ట్రేషన్ చేశారు. 2024 సెప్టెంబర్‌లో నర్సాపురం గ్రామానికి చెందిన పిట్టల ప్రభాకర్ పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారంతా ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేసుకుని 347/ఈ లో 2.27 ఎకరాలు, 347/లో 1.21 ఎకరాలను కలిపి మొత్తం 4.08 ఎకరాలు కబ్జా చేశారు. దీనిపై బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు పోలీసులు, ఎర్ర అయిలయ్య అనుచరులైన పిట్టల ప్రభాకర్, ఉదయ్‌రెడ్డి తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు' అని మిర్యాల పద్మ ఆవేదన వ్యక్తం చేసింది.



తమకు జరిగిన అన్యాయాన్ని మీడియాకు వివరిస్తున్న మిర్యాల పద్మ, ఆమె కుమారుడు మిర్యాల ప్రశాంత్

# యువవికాసం.. గందరగోళం

- సీఎంవో, డిప్యూటీ సీఎం విభిన్న ప్రకటనలు
- ఆర్థిక సాయంపై స్పష్టతలేక అయోమయం
- చిత్తశుద్ధిలేని పథకమే అంటున్న నిరుద్యోగులు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పిస్తామంటూ ప్రభుత్వం సోమవారం ప్రారంభించిన 'యువ వికాసం' పథకం గందరగోళంగా తయారైంది. ఆర్థిక సాయంపై సీఎంవో, డిప్యూటీ సీఎం, అధికారులు భిన్నమైన ప్రకటనలు చేశారు. ఇలా ఒక్కొక్కరు భిన్నమైన ప్రకటనలు చేయడంతో నిరుద్యోగులు గందరగోళానికి గురవుతున్నారు. ప్రభుత్వ పెద్దల్లోనే స్పష్టతలేని పథకం అమలు జరుగుతుందా అని ప్రశ్నిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం రాజీవ్ యువవికాసం పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఒక్కో నియోజకవర్గంలో4-5 వేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. రూ.6వేల కోట్లతో మొత్తం 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఒక్కొక్కరికి రూ. 50వేల నుంచి రూ.4లక్షల వరకు మంజూరు చేస్తామని వివరించారు. జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తామని చెప్పారు. పన్నుల వసూలులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు.

**ఆర్థిక సాయంపై ఎవరేమన్నారంటే..!**

**రేవంత్‌రెడ్డి: రూ.50వేల నుంచి రూ.4లక్షలు**
**భట్టివిక్రమార్క: రూ.3లక్షలు**
**ప్రభుత్వ అనుకూల రిపోర్టర్: రూ.5లక్షలు**
**సీఎం పీఆర్వో: రూ.4లక్షలు**




ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహిస్తున్న పూసూరు గ్రామస్థులు

# నీటి గోస ఉన్నదని పిల్లనిస్తలేరు!

- పొద్దంతా నీళ్లు మోయడమే పని
- తమ బిడ్డలకు నీటికష్టాలు రావద్దని పెండ్లి సంబంధాలకు తల్లిదండ్రుల విముఖత
- కలెక్టరేట్‌కు గ్రామస్థుల పయనం
- ఆదిలాబాద్ జిల్లాలో ఓ పల్లె దుస్థితి
- రాష్ట్రంలోని ఊరూరా ప్రజలకు తప్పని తాగునీటి తంటాలు

*తాగునీటి కష్టాలు ఊళ్లకు ఊళ్లకే తలవంపులు తెస్తున్నాయి. ఎన్నో విపరిణామాలకు దారితీస్తున్నాయి. ఊరంతటికే గడ్డు పరిస్థితులను తెచ్చి పెడుతున్నాయి. ఇక్కడ ఏకంగా ఆ ఊరి యువకులకు ఆడపిల్లలను ఇచ్చేందుకే వెనుకాడుతున్నారు. ఆ ఊళ్లో ఉన్న తాగునీటి గోస తమ బిడ్డ పడొద్దనే ఆ తల్లిదండ్రులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా సుంగాపూర్ గ్రామ గిరిజనులకు ఈ దుస్థితి ఎదురైంది. దీంతో ఊరంతా ఏకమై ఖాళీబిందెలు చేతబట్టి కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ పరిస్థితి ఒక్క సుంగాపూర్‌దే కాదు.. రాష్ట్రంలోని ఊరూరా ప్రజలు ఇదేరీతిన తాగునీటికి తహతహలాడుతున్నారు.*

ఆదిలాబాద్, మార్చి17 (నమస్తే తెలంగాణ)/ఇల్లెందు/చర్ల/తరిగొప్పుల/భైంసా/ఏటూరునాగారం: ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ఆడపిల్లలను ఇస్తే తమ బిడ్డ నీటిని మోస్తూ కష్టపడుతుందని తల్లిదండ్రులు ఆ గ్రామాలతో వివాహ సంబంధాలు ఏర్పర్చుకోవడం లేదు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం సుంగాపూర్‌లో 1500 జనాభా ఉంటుంది. గ్రామ పరిధిలో చెరువులు లేవు. గ్రామమంతటికీ ఒకటే చేతిపంపు ఉన్నది. దీంతో సాగు, తాగునీటి సమస్య ఆ ఊరిని చుట్టుముట్టింది. వ్యవసాయ పనులు మానుకొని ఊరు ఊరంతా పొద్దంతా తాగునీటిని మోయాల్సి వస్తుంది. తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినా ఫలితం రాలేదు. మిషన్ భగీరథ నీరు రెండురోజులకు ఒకసారి వస్తున్నా.. అదీ పూర్తిస్థాయిలో రావడం లేదు. గ్రామంలో తాగునీటి ఇక్కట్ల కారణంగా తమ గ్రామంలో యువకులకు ఆడపిల్లలను ఇవ్వడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో నీటి సమస్య పరిష్కారానికి ఊరంతా కదిలింది. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌కు ఖాళీబిందెలతో వెళ్లి ప్రజావాణిలో దరఖాస్తును అందజేశారు. గ్రామస్థులు తమ ఊరి దుస్థితిని కలెక్టర్‌కు ఏకరువు పెట్టారు. తమ సమస్యను విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. నీటి సమస్య కారణంగా తమ గ్రామానికి ఆడపిల్లలను ఇవ్వడానికి ఇతర గ్రామాల తల్లిదండ్రులు ఇష్టపడడం లేదని సుంగాపూర్‌కు చెందిన రాథోడ్ సుజన్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తంచేశారు.



మంచినీటి సమస్య పరిష్కరించాలని ఆదిలాబాద్ కలెక్టరేట్‌కు తరలివెళ్తున్న ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం సుంగాపూర్ గిరిజనులు

### ఊరూరా ఖాళీ బిందెలతో నిరసనలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం పాతర్లగడ్డ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు సోమవారం ఖాళీ బిందెలతో రహదారిపై నిరసన తెలిపారు. బోర్లలో నీరు ఇంకిపోయిందని, మిషన్ భగీరథ నీళ్లు నెల రోజులుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయక, తామే ఇంటికి కొంత జమ చేసి ట్యాంకర్‌తో నీళ్లు తెప్పించుకుంటున్నామని తెలిపారు. చర్ల మండలం ఆర్ కొత్తగూడెంలో ఎస్సీ కాలనీవాసులు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అంకుషాపూర్ బంజరుపల్లి కాలనీలో 15 రోజులుగా మంచినీళ్లు రాకపోవడంతో సోమవారం కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. నిర్మల్ జిల్లా భైంసా కమ్మర్‌గల్లిలో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మిషన్ భగీరథ నీరు రెండు రోజులుగా రావడం లేదని, మున్సిపల్ సిబ్బంది బోరు మోటర్లు తీసివేయడంతో నీటి కష్టాలు తప్పడం లేదని ఆందోళనకు దిగారు.

### తాగునీటి కోసం 20 కి.మీ. కాలినడక

తమకు తాగునీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని కోరుతూ ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరు గ్రామంలో గుడిసెల్లో నివాసముంటున్న గిరిజనులు కాలినడకన 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఐటీడీఏ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు. ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. ఉదయం 7 గంటలకు బయలుదేరిన గ్రామస్థులు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకున్నారు. నెత్తిన ఖాళీ బిందెలతో ప్రదర్శనగా తరలివచ్చారు. దీంతో స్పందించిన పీవో సంబంధిత అధికారులతో మాట్లాడి తాగునీరు, విద్యుత్తు సదపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణపై టీటీడీ వివక్ష

- మన ప్రజాప్రతినిధుల 'సిఫారసు'లకు కోత

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఏపీ ప్రభుత్వం అదే వివక్ష కొనసాగిస్తున్నది. ఏపీ ప్రజాప్రతినిధులకు వారంలో 4 రోజులు.. ప్రతిరోజు 1 బ్రేక్, 1 ప్రత్యేక దర్శనాలకు (స్థపతం) టీటీడీ అనుమతి ఇస్తున్నది. తెలంగాణ ప్రజాప్రతినిధులకు వారంలో 2 రోజులు మాత్రమే సిఫారసు లేఖలకు అనుమతించిం ది. వారం మొత్తంలో రెండు రోజుల్లో రోజుకు ఒకటి చొప్పున, రెండు వీఐపీ బ్రేక్, రెండు ప్రత్యేక దర్శనాలకు(స్థపతం)కి మాత్రమే అనుమతి ఇచ్చింది. ఈ మేరకు టీటీడీ సోమవారం నిర్ణయం తీసుకున్నది. ఉమ్మడి ఏపీలో మొత్తం 294 మంది ఎమ్మెల్యేలకు బ్రేక్ దర్శనాలు, వసతి సౌకర్యాలు కల్పించేవారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల ఒత్తిడికి ఏపీ సర్కారు తాజాగా తలొగ్గింది. కానీ, కోటాకు కోతలు విధించి సిఫారసు లేఖలను అనుమతిస్తున్నట్టు ప్రకటించింది. ఈ విధానాన్ని మార్చి 24 నుంచి అమలులోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది. అయితే ఫిబ్రవరి 1 నుంచి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు అనుమతించాల్సి ఉన్నా.. టీటీడీ తాత్సారం చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు టీటీడీ సిఫారసు లేఖలపై దర్శనానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, నామమాత్రంగానే కోటా కేటాయించడం చర్చనీయాంశంగా మారింది.

### లేఖలపై దర్శనాలు ఇలా..

శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి తెలంగాణ ప్రజాప్రతినిధుల నుంచి బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆది, సోమవారాల్లో (సోమ, మంగళవారం దర్శనాలకు) మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపింది. బుధ, గురువారాల్లో రూ.300 ప్రత్యేక దర్శనాలకు (ఏ రోజుకు ఆ రోజే లేఖలు) అనుమతిస్తామని పేర్కొన్నది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ మాత్రమే (ఆరుగురు భక్తులకు మించకుండా) స్వీకరిస్తామని స్పష్టం చేసింది. ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి ఆదివారం ఏపీ ప్రజాప్రతినిధుల నుంచి స్వీకరిస్తున్న సిఫారసు లేఖలు ఇకపై శనివారం నాడు(ఆదివారం దర్శనం కోసం) స్వీకరించనున్నట్టు తెలిపింది. తిరుమలలో సౌకర్యాలను, దర్శన సమయాలను దృష్టిలో ఉంచుకుని సుదీర్ఘంగా చర్చించి, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ వెల్లడించింది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరింది.

### వడదెబ్బతో ఒకరి మృతి

కేసముద్రం, మార్చి17 : నెలరోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి వడదెబ్బతో మృతిచెందినట్టు ఎస్సై మురళీధర్‌రాజ్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం ఉప్పరిగూడెంకు చెందిన దుంపల రాజు (48) నెల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆహారం లేక నీరస పడిపోయి, ఎండలకు తట్టుకోలేక మృతిచెందాడు.




### పెండింగ్ వేతనాల కోసం జీపీల ధర్నా

*తిరుమలాయపాలెం/ గద్వాల/మాగనూరు, మార్చి 17: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని గ్రామపంచాయతీ కార్మికులు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. గద్వాల కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టగా, నారాయణపేట జిల్లా మాగనూరు ఎంపీడీవో రహిమతుద్దీన్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు.*

# కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీల ధర్నా

న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా సోమవారం అంగన్‌వాడీలు ధర్నాలు, ఆందోళన చేపట్టారు. అశ్వారావుపేట, చర్ల, దుమ్ముగూడెం, టేకులపల్లి, ఇల్లెందు, మణుగూరు మండలాల్లో ధర్నాలు నిర్వహించారు. కామారెడ్డిలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు.

